సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 2 । మార్చి । 2024



కళలకు నిలయం
కళలకు నిలయంగా క్షీరారామం భాసిల్లుతోంది. పాలకొల్లులో ఆదివారం నుంచి 15వ జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. IIలో



అర్హులందరికీ పక్కా ఇళ్లు
రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. IIలో



సొంతింటి కల సాకారం
రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. IIలో

పేదల చదువులకు జగనన్న దీవెనలు

- 33,400 మందికి రూ.26.69 కోట్లు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



భీమవరం కలెక్టరేట్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం: పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పూర్తి రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో జగనన్న విద్యా దీవెన చెక్కును విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలుచేయడం విద్యార్థుల అదృష్టమన్నారు. పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులకు ఆస్కారం ఉంటుందన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 33,400 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.26.69 కోట్లు జమ చేస్తున్నామన్నారు. దీనిలో ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా 5,786 మందికి రూ.4.20 కోట్లు, ఎస్టీ సంక్షేమ శాఖ ద్వారా 189 మందికి రూ.11.68 లక్షలు, బీసీ సంక్షేమ శాఖ ద్వారా 15,281 మందికి రూ.11.85 కోట్లు, ఈబీసీ కోటాలో 3,039 మందికి రూ.2.95 కోట్ల లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. కాపు సంక్షేమం కింద 8,039 మందికి రూ.6.72 కోట్లు, ముస్లిం, మైనార్టీ కోటాలో 361 మందికి రూ.35.36 లక్షలు, క్రిస్టియన్, మైనార్టీ కోటాలో 661 మందికి రూ.48.89 లక్షల ప్రయోజనం చేకూర్చామన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి శోభారాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖాధికారి పుష్పరాణి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

78 శాతం మేర పింఛన్ల పంపిణీ



భీమవరంలో లబ్ధిదారుడి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో తొలిరోజు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం 78 శాతం మేర జరిగింది. జిల్లాలో మొత్తం అన్నిరకాల పింఛన్ లబ్ధిదారులు 2,35,746 ఉండగా వారికి రూ.69.17 కోట్లు అందించాల్సి ఉంది. మొదటి రోజు 1,80,000 మంది లబ్ధిదారులకు రూ.53 కోట్ల మేర అందజేశారు.

'డయల్ యువర్ ఎస్పీ'కి 6 ఫిర్యాదులు

భీమవరం: భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందాయి. ఎస్పీ వేజెండ్ల అజిత ఫోన్‌లో అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆకివీడుకు చెందిన ఓ మహిళ తాను జనవరి 11న ఆటోలో హ్యాండ్ బ్యాగ్ మర్చిపోయానని, పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగలేదని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఇరగవరానికి చెందిన వ్యక్తి తాను గుర్తింపు లేని చిట్స్ కంపెనీలో నగదు జమచేసి మోసపోయానని న్యాయం చేయాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డయల్ యువర్ ఎస్పీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని బాధితులు ఫోన్‌లో తమ సమస్యలను తెలియజేయవచ్చని చెప్పారు.

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి సర్వే



ఎంఎస్‌ఎంఈ వన్ బ్యానర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించారని, దీనిలో భాగంగా పరిశ్రమల శాఖకు సర్వే నిర్వహిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీ ఎంఎస్‌ఎంఈ వన్ బ్యానర్‌ను ఆయన విడుదల చేశారు. ఎంఎస్‌ఎంఈ సర్వేకు అందరూ సహకరించాలని, సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగంలోని ఎంఎస్‌ఎంఈలను ఏపీ ఎంఎస్‌ఎంఈ.వన్ పోర్టల్‌కు అనుసంధానిస్తారన్నారు. రానున్న నాలుగేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను రెట్టింపు చేయడంతోపాటు వ్యాపారాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 1,754 పోలింగ్ స్టేషన్లకు స్టేషనరీ సామగ్రి సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీలోపు కలెక్టరేట్‌లోని కో–ఆర్డినేషన్ సెక్షన్‌లో టెండర్ ఫామ్ పొందాలని పేర్కొన్నారు. సీలు వేసిన టెండర్లు 7వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కలెక్టరేట్‌లోని బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు టెండర్లు తెరిచి ఫైనల్ చేస్తామని పేర్కొన్నారు.

టెట్‌కు 93 శాతం హాజరు

భీమవరం: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 93 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. రెండు కేంద్రాల్లో 401 మందికి 373 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. నాల్గో రోజు శుక్రవారం 681 మంది హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 370 మందికి గాను 338 మంది, మధ్యాహ్నం పరీక్షకు 370 మందికి 343 మంది హాజరయ్యారు.

'కాపు' కాసిన సంక్షేమం

- కాపులకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కాపు నేస్తం ద్వారా మహిళలకు ఆర్థిక తోడ్పాటు
- ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం
- జిల్లాలో 28,004 మందికి రూ.168.02 కోట్ల లబ్ధి



గతేడాది కాపు నేస్తం నాల్గో విడత చెక్కు అందిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, భీమవరం: కాపులకు అన్నివిధాలా అండగా ఉంటానంటూ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా కాపుల బలోపేతమయ్యేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లోను సముచిత స్థానం కల్పించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించకపోయినా దారిద్ర రేఖకు దిగువన ఉన్న కాపు, తెలగ, ఒంటరి, బలిజ కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలను ఆర్థికంగా శక్తివంతం చేయడం, జీవనోపాధి కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రవేశపెట్టి కాపుల సంక్షేమంపై చిత్తశుద్ధిని చాటుతున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఆయా సామాజికవర్గాల వారి చెంతకే వచ్చి అర్హులను ఎంపిక చేసేలా చర్యలు తీసుకున్నారు. అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఏడాదికి రూ.15 వేల చొప్పున మహిళల ఖాతాలో జమచేస్తున్నారు.

రూ.60 వేల లబ్ధి

గత నాలుగేళ్లలో నాలుగు విడతలుగా ఒక్కో లబ్ధిదారురాలికి కాపు నేస్తం పథకం కింద రూ.60 వేల చొప్పున అందజేశారు. జిల్లాలో సగటున 28,004 మంది లబ్ధిదారులకు రూ.168.02 కోట్లను అందించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పనుల్లేక విలవిలాడుతున్న సమయంలో ప్రభుత్వం అందించిన సాయం ఆయా కుటుంబాలకు ధైర్యాన్నిచ్చింది. ప్రభుత్వ తోడ్పాటుతో ఎందరో కాపు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

కాపు నేస్తం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2020–21	24,199	36.30
2021–22	21,815	32.72
2022–23	31,361	47.04
2023–24	34,642	51.96

అన్నివిధాలా తోడ్పాటు



వ్యవసాయమే జీవనాధారమైన మాకు సీఎం జగన్ హయాంలో అన్నివిధాలా తోడ్పాటు లభిస్తోంది. కాపు నేస్తం పథకం ద్వారా రూ.60 వేల సాయం పొందాను. నా భర్తకు పింఛన్ వస్తోంది. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా కింద ఇప్పటివరకూ రూ.56 వేలు అందింది. గతంలో ఎవ్వరూ కాపులకు ఇలాంటి పథకాలు అందించలేదు.

– ఇర్రింకి జయలక్ష్మి, తోలేరు, వీరవాసరం మండలం

జీవనోపాధి పొందుతున్నా..



నాకు మూడు విడతల్లో కాపు నేస్తం పథకం ద్వారా రూ.45 వేల లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా కింద మరో రూ.54 వేలు రుణమాఫీ అయ్యాయి. ప్రభుత్వ సాయంతో ఇంటి వద్ద గరాజీలు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నా. ఈ ప్రభుత్వంలో అన్నివిధాలా మాకు మంచి మేలు జరిగింది. జగన్ సర్ మేలును మరువలేం.

– పిండి సూర్యావతి, అడివిపాలెం, యలమంచిలి మండలం

పథకాలే అండదండలు



ఏటా వైఎస్సార్ ఆసరాగా రూ.18 వేలు, కాపు నేస్తం కింద రూ.15 వేలు అందుతున్నాయి. దీనికితోడు ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ ఇస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో కుమారుడితో కలిసి ఇంటి వద్దనే కిరాణా షాపు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. సంక్షేమ పథకాలే మాకు కొండంత అండగా ఉన్నాయి.

–మల్లిపూడి సుజాత, మల్లిపూడి మెరక, నరసాపురం రూరల్

జగన్ మేలు మరువలేం



కాపు నేస్తం ద్వారా రూ.60 వేలు అందింది. మరో రూ.60 వేలు డ్వాక్రా రుణమాఫీ చేశారు. దివ్యాంగురాలైన నా కుమార్తెకు నెలకు రూ.3 వేల పింఛన్ వస్తోంది. సొంతింటి కలను నెరవేరుస్తూ స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షల సాయం అందించారు. జగన్ సర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– సోదాబత్తుల సత్యవతి, కుప్పనపూడి, ఆకివీడు మండలం.

పెద్ద కొడుకులా..



సీఎం జగన్ వచ్చిన తర్వాత కాపు నేస్తం కింద రూ.60 వేలు పొందాను. మా అబ్బాయి ఉన్నత చదువులకు ఈ సొమ్ములు ఉపయోగపడ్డాయి. వైఎస్సార్ ఆసరా కింద రూ.72 వేలు అందుకున్నా. నా భర్త అకాల మరణం చెందితే పింఛన్ అందిస్తున్నారు. ఇంటికి పెద్దకొడుకులా సీఎం జగన్ మమ్మల్ని ఆదుకున్నాడు.

– చింతా విజయలక్ష్మి, మోగల్లు, పాలకోడేరు మండలం

కాపు నేస్తం ఆదుకుంది



నా భర్త వ్యవసాయ కూలీ పనులతో పాటు ఇంటి వద్ద బరకాలు కుడుతూ ఉపాధి పొందుతున్నాం. మా కుటుంబానికి కాపు నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు అందిస్తున్నారు. ఇది ఎంతో ఆసరాగా ఉంది. డ్వాక్రా రుణమాఫీ కూడా చేశారు. ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా వలంటీర్లే అన్ని చూసుకుంటున్నారు.

– సిరిగినీడి రాజ్యలక్ష్మి, యాళ్లవానిగరువు, పాలకొల్లు మండలం

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న డీఈఓ వెంకటరమణ

అత్తిలి : భీమవరంలో శుక్రవారం జరిగిన ఈఎండీపీలో భాగంగా జిల్లాస్థాయి ప్రదర్శనలో అత్తిలి మండలం బల్లిపాడు హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ ప్యానల్ క్లీనర్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం వైఎస్సార్‌సీఎం దత్ తెలిపారు. ఈ ప్రాజెక్టును ఈనెల 6న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు. 9వ తరగతి విద్యార్థులు కె.రాము, వి.సాయిబాలాజీ, పి.మహేష్‌కిరణ్ ప్రాజెక్టును రూపొందించగా ఉపాధ్యాయులు ఎస్‌కే మల్లేశ్వరరావు, డీఎంజీ ప్రసాద్ మార్గదర్శనం చేశారన్నారు. తమ విద్యార్థులు డీఈఓ ఆర్.వెంకటరమణ చేతులమీదుగా జ్ఞాపిక, అభినందన పత్రం అందుకున్నారన్నారు.

84 వేల ఓటరు కార్డుల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇప్పటివరకు 84,324 ఓటరు కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశామని, మిగిలిన కార్డులు ప్రింటింగ్ పూర్తయిన వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. విజయవాడ నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీఎల్‌ఓల శిక్షణ పూర్తయ్యిందని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి రెండు ఫిర్యాదులు రాగా ఒకటి పరిష్కరించామని, మరొకటి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



భీమవరం సీఎస్ఎన్ కళాశాల కేంద్రం వద్ద ఇంటర్మీడియెట్ విద్యార్థులు

భీమవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 52 కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 96.70 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. మొత్తంగా 18,288 మంది విద్యార్థులకు 17,690 మంది హాజరయ్యారన్నారు. 24 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండగా విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారు.

ఏలూరు జిల్లాలో.. 51 కేంద్రాల్లో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో 51 కేంద్రాల్లో 16,029 మంది విద్యార్థులకు 15,275 మంది హాజరయ్యారు. వీరిలో 13,798 మంది జనరల్ విద్యార్థులకు 13,328 మంది హాజరయ్యారు. 2,231 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,947 మంది హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం హాజరు నమోదైంది. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, ప్రశాంతంగా జరిగాయని జిల్లా వృత్తివిద్యా అధికారి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

విప్ గ్రంధి శ్రీనివాస్



పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: ప్రజలకు తన ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరితేనే రానున్న ఎన్నికల్లో తనకు ఓట్లు వేయాలని కోరే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భీమవరం క్యాంపు కార్యాలయంలో వీరవాసరం మండలం కొణితివాడకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు గతంలో 600 హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత ఒక్క హామీని కూడా అమలుచేయకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. సీఎం జగన్ ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ చేస్తున్నారన్నారు. చంద్రబాబు దగా, మోసం, వెన్నుపోటు రాజకీయాలకు నిలువుటద్దంకాగా.. విశ్వసనీయత, ఇచ్చిన మాటను కట్టుబడిన నైజం సీఎం జగన్‌ది అన్నారు. కోవిడ్ సమయం సీఎం జగన్ చేపట్టిన చర్యలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఆ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రజలకు సేవ చేయడం బాధ్యతగా భావించి పని చేస్తున్నానన్నారు. చంద్రబాబు మోసాన్ని గ్రహించడం వల్లనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముందుగా ఇళ్ల సత్యనారాయణ, దొడ్డి రామకృష్ణ, భీశెట్టి దానేశ్వరి, మళ్ల ధనలక్ష్మి, పెంటకోటి మాధవ, చదరం త్రిమూర్తులు, పొరమెరశెట్టి పార్వతి, యల్లపు రామసీత, పెంటకోటి పెద అప్పారావు, శాంతకుమారి, ఆళ్ల వీరబాబు, యల్లపు రామారావు తదితరులకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, వీరవాసరం మండల అధ్యక్షుడు కడలి ధర్మారావు, కొణితివాడ ఉప సర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు, అండలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మానుకొండ ప్రదీప్, భీశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

కలిదిండి: దక్షిణ కాశీగా పేర్గాంచిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూరల్ సీఐ బి.కృష్ణకుమార్‌కు సూచనలు ఇచ్చారు. భక్తులు స్నానమాచరించే కొనేరు వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 10 వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి తీర్థం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కృష్ణకుమార్, ఎస్సై ప్రియకుమార్ ఉన్నారు.

కాళీపట్నం భూములకు మోక్షం

నేడు పట్టాల పంపిణీ



కాళీపట్నం భూములు

మొగల్తూరు: కాళీపట్నం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు శనివారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. దశాబ్దాల సమస్యను చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన 1585 జీఓను ఉపసంహరించి జీఓ 7ను విడుదల చేశారు. దీని ఆధారంగా 1945 నాటికి కాళీపట్నం భూములపై సాగు చేసుకునే రైతులకు అవకాశం కలగడంతో ఇటీవల రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు సాగు చేసుకునే రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. సుమారు 5 వేల ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేయనున్నారు. చీఫ్ విప్ ప్రసాదరాజు కృషితో కాళీపట్నం భూముల సమస్య పరిష్కారం కావడంపై కాళీపట్నం రెవెన్యూ గ్రామాల పరిధి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నరసాపురం మండలం దర్బరేవు కంపెనీ భూముల సమస్యను కూడా ప్రసాదరాజు పరిష్కరించారని అంటున్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రేతల అరెస్ట్


చిల్లబోయినపల్లి వద్ద గంజాయి తరలింపుదారులతో పోలీసులు

ముసునూరు: యువకులను, కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని, గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. శుక్రవారం ఏలూరు నుంచి నూజివీడుకు, చిల్లబోయినపల్లి మీదుగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులు చింతం విజయ్‌బాబు(27), షేక్ మొహిద్దీన్(23), షేక్ మెహరా(20) లను బైక్‌తో సహా పట్టుకుని, ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తరలింపుదారులు ముగ్గురూ నూజివీడుకు చెందిన వారుగా తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎమిలీ కుమారి సమక్షంలో నిందితుల వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దొంగతనాలపై కేసు నమోదు

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామానికి చెందిన ఇద్దరి మహిళల మెడలో బంగారు వస్తువులు చోరీకి గురికావడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెరుకువాడ గ్రామంలో గత నెల 29న చెన్నమల్లేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ముదునూరి సరస్వతి, పెన్మత్స శైలజా అనేవారు ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అదే సమయంలో సరస్వతికి చెందిన 2 కాసుల బంగారు సూత్రాల తాడు, శిరీష మెడలోని రెండున్నర కాసుల నానుతాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆలయం నుంచి బయటకు వచ్చి చూస్తే బంగారు వస్తువులు కనిపించకపోవడంతో ఆ ప్రాంతం అంతా వెతికినా వస్తువులు లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళలకు నిలయం..క్షీరారామం

రేపటి నుంచి పాలకొల్లులో 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు


ఉత్తమ బహుమతి పొందిన అభినయ ఆర్ట్స్, అతీతం నాటిక (ఫైల్)


ద్వితీయ బహుమతి పొందిన రాఘవ మూవీ మేకర్స్ వారి కెరటాలు (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: కళలకు నిలయంగా కళాకారులకు ఆలయంగా క్షీరారామం బాసిల్లుతోంది. పాలకొల్లును క్షీరారామంగా కళాకారులు పేర్కొంటూ ఉంటారు. క్షీరారామలింగేశ్వరుడు కొలువైన ప్రాంతం కాబట్టి క్షీరారామం అనే నానుడి ఎప్పటి నుంచో ఉంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న పాలకొల్లులో ఆదివారం నుంచి 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నారు. సమాజాన్ని చైతన్యపరిచే ఏకైక సాధనం నాటకం . నాటక రంగానికి పుట్టినిల్లుగా పేర్కొనే పాలకొల్లులో గత 60 ఏళ్లుగా జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తూనే ఉన్నారు. గతంలో మహాత్మా మిత్ర బృందం, మిత్ర బృందం, సంగీత నాటక అకాడమీ, దాసరి నారాయణ రావు కల్చరల్ అకాడమీ, క్షీరపురి నాటక అకాడమీ, లలిత కళాంజలి నాటక అకాడమీల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహిస్తూ వచ్చారు. దానితో తెలుగు నాటక రంగం తనకంటూ ఓ సుస్థిరస్థానాన్ని, కీర్తి ప్రతిష్ఠలను సాధించుకుంది.

గత నాటక అకాడమీల స్ఫూర్తితో గత 15 ఏళ్ల నుండి పాలకొల్లు కళాపరిషత్ పేరున జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నాయి. అలాగే కొంత మంది కళాప్రియులను స్మరించుకుంటూ చలం స్మారక నాటకోత్సవం, అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, ఈవీవీ సత్యనారాయణ, వంగా అప్పారావు, దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, కలిదిండి రఘురామరాజు, విన్నకోట వెంకటేశ్వరరావుల పేరున జాతీయ స్థాయి స్మారక నాటకోత్సవాలు నిర్వహిస్తూ వారిని స్మరించుకునేవారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన రంగస్థల ప్రముఖులు నాయుడు గోపి, వైఎస్ కృష్ణేశ్వరరావు, గంగోత్రి సాయి, ఎన్ రవీంద్రరెడ్డి, గోపరాజు రమణ వంటి రంగస్థల ప్రముఖులు ప్రదర్శించిన నాటికలకు పాలకొల్లు కళాపరిషత్ ద్వారా అనేక బహుమతులను గెలుచుకున్నారు. వీరితో పాటు మరింత మంది కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో గత 15 ఏళ్లుగా పాలకొల్లు కళాపరిషత్ ఏర్పాటుచేసి నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు.

పోటీల నిర్వహణ ఇలా

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో మార్చి 3,4,5 తేదీల్లో 15వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభంకానున్నాయి. స్థానిక అద్దేపల్లి వారి సత్రం ప్రాంగణంలో నాటికలు నిర్వహించనున్నారు. మార్చి 3 ఆదివారం రాత్రి 8 గంటల నుండి చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక, విటిపిఎస్ కల్చరల్ అసోసియేషన్, ఇబ్రహీంపట్నం (విజయవాడ) వారి ఎనిమీ నాటిక, మార్చి 4 సోమవారం వెలగలేరు థియేటర్స్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటిక, అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి వారి మనస్విని నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి విముక్తి నాటిక, మార్చి 5 మంగళవారం అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక, గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి మూల్యం నాటిక ప్రదర్శించబడుతుంది. అనంతరం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

కళలను ప్రోత్సహించడమే లక్ష్యం



కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కళాపరిషత్ నిర్వహిస్తున్నాం. కళాప్రియుల ప్రోత్సాహం వల్ల నేటికి కళలకు ఆదరణ తగ్గలేదనే చెప్పాలి. ఇలాంటి నాటక కళాపరిషత్‌ల ద్వారా పాలకొల్లు నుంచి ఎంతో మంది కళాకారులు తమ ప్రతిభను చాటుకుని అగ్ర దర్శకులు, నటులుగా గుర్తింపు పొందారు.

– కేశ కృష్ణవర్మ, అధ్యక్షుడు, పాలకొల్లు కళాపరిషత్

పాలకొల్లుకు గుర్తింపు



నాటక రంగంలో పాలకొల్లుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నేను ప్రదర్శించిన అనేక నాటికలకు బహుమతులు అందుకోవడం పాలకొల్లు బిడ్డగా గర్వపడుతున్నాను. ఇటీవల గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో బాలల నాటక విభాగానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించి నంది అవార్డు కూడా అందుకున్నాను.

– మానాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు కళాపరిషత్

మహిళల సాధికారతే లక్ష్యం


ఏలూరు కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న మెప్మా ఏపీ మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, మెప్మా పీడీ ఇమ్మానుయేల్

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థిక స్వావలంబనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వారి కుటుంబాలను పోషించుకునే స్థాయికి ఎదిగేలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మెప్మా ఏపీ మిషనర్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు పురపాలక సంఘాల్లోని మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, సీవోలు, ఆర్పీలతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఐదేళ్ళ కాలంలో గ్రూపుల్లోని మహిళలు సాధించిన ఆర్థిక పురోభివృద్ధిపై ఆరా తీశారు. మెప్మా పీడీ బి.ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో మెప్మా పీడీ ఇమ్మానుయేలు, ఏవో రామాంజనేయులు, సీఎంఎం కే.సుధాకర్‌రావు, ఎస్ఎంఎం ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మీరు నొక్కే బటన్ మీ భవిష్యత్‌కు స్విచ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమాబాల, చిత్రంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: వచ్చే ఎన్నికల్లో మీరు నొక్కే బటన్ మీ భవిష్యత్‌కు స్విచ్‌లాంటిదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నర్సాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గూడూరి ఉమాబాల చెప్పారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు జగనన్న కాలనీలో లబ్ధిదారుల పట్టా రిజిస్ట్రేషన్ హక్కు పత్రాల్ని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన సభలో నర్సింహరాజు, ఉమాబాల మాట్లాడుతూ దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు తాళ్లకోడులో 74 ఎకరాల్ని పేదల ఇళ్ల కోసం కొనుగోలు చేశారన్నారు. స్థలాల్ని పూడ్చి, లేఅవుట్ వేసినప్పటికీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో పేదలకు పట్టాలు ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేశారన్నారు. కాలనీలో 3,600 పట్టాలు పంపిణీ చేయగా 60 శాతంకు పైగా ప్రజలు ఇళ్ల నిర్మించుకున్నారని చెప్పారు. ఇళ్ల స్థల పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి భూమి విలువ పెంచారన్నారు. లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు కల్పించారని ఐదేళ్ల తరువాత అమ్ముకోవచ్చని అన్నారు. సమావేశంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు) మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) ఎంపీపీ కఠారి జయలక్ష్మి, భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ పాల్గొన్నారు.

జాతి అస్తిత్వానికి చిహ్నం భాష


ఏపీ నిట్‌లో మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: భాష ఒక జాతి అస్తిత్వానికి చిహ్నమని ఏపి నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి అన్నారు. శుక్రవారం నిట్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన మాతృభాషా దినోత్సవాల్లో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ భారతదేశం విభిన్న భాషలకు పుట్టినిల్లు అన్నారు. ప్రతి భాషకూ తనదైన సోయగం, శైలి విశిష్టత ఉంటాయన్నారు. ఎవరి మాతృభాష వారికి తల్లి లాంటిదన్నారు. మాతృభాష ద్వారానే ప్రజల వ్యక్తిత్వం వికసిస్తుందన్నారు. ఎవరి భాష, సంస్కృతులను వారే పరిరక్షించుకోవాలన్నారు. మాతృభాషను ప్రేమిస్తూ , ఇతర భాషలను సైతం ఆదరించాలన్నారు. తెలుగు తరాలకు వెలుగు అని, తెలుగు భాష ఎంతో మధురమైనదన్నారు. నిట్ అధికారులు వీరేష్‌కుమార్, ఎస్.జయరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కేంద్రమంత్రిని కలిసిన అప్సడా రఘురాం


కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలాతో అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం గురువారం ఢిల్లీలో కేంద్ర ఫిషరీస్ శాఖా మంత్రి పురుషోత్తం రూపాలాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా కల్చర్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆక్వా రంగంలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకొచ్చి ఆక్వా రంగం బలోపేతానికి చర్యలు తీసుకున్నారని కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.3420 కోట్లు సబ్సిడీ ద్వారా ఆక్వా రైతులకు అందించామన్నారు. ఆక్వా రంగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం గురించి చర్చించారు. అనంతరం నీతిఆయోగ్ సీఈఓ పీవీఆర్ సుబ్రహ్మణ్యం, సలహాదారు నీలిమా పటేల్‌ను కలిశఖురారు. ఈ నెల 15,16 తేదీల్లో విశాఖపట్టణంలో నీతిఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా సెమినార్ విశేషాలపై చర్చించారు.

పరీక్ష రాసేందుకు వెళుతూ..


ప్రమాదంలో మృతి చెందిన పలగాని లావణ్య

పెదవేగి: మండలంలోని వంగూరు ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని లావణ్య ఏలూరు ఎస్ఆర్ఐ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం లావణ్య పరీక్షలు రాసేందుకు బి.సింగవరం నుంచి తన బంధువుకు చెందిన ద్విచక్ర వాహనంపై ఏలూరుకు బయలుదేరింది. లావణ్య ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వంగూరు ఎఫ్‌సీ: గోడౌన్ దగ్గర లోపలికి వెళుతున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. దీంతో లావణ్య తలకు బలమైన గాయమై ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

దెందులూరు: చెన్నైలోని జప్టర్ యూనివర్సిటీలో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జూనియర్ మిస్టర్ ఇండియాగా రామారావుగూడేనికి చెందిన పోడుమల్లి పవన్ గోల్డ్ మెడల్ సాధించారు. గత నెల 26న నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరులో రామలక్ష్మణ్ జిమ్ యాజమాన్యంతో పాటు రామారావుగూడెం గ్రామస్తులు పవన్‌కు అభినందనలు తెలిపారు. పవన్ గత నెల 13న కేరళలో నిర్వహించిన పోటీల్లో కూడా ఆల్ ఇండియా చాంపియన్‌గా నిలిచాడు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఇటీవల జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై వసతి గృహం వార్డెన్ నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందించినట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజుకు అభియోగాలు మోపుతూ నోటీస్ జారీ చేసి ఎంక్వైరీ అధికారిని నియమించామని పేర్కొన్నారు. ఎంక్వైరీ అనంతరం క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని వివరించారు. అదేవిధంగా ఏటీడబ్ల్యూఓగా పనిచేస్తున్న కె.కృష్ణమోహన్‌కు కూడా క్రమశిక్షణ చర్యల నిమిత్తం సంచాలకులు, గిరిజన సంక్షేమం ఏపీ విజయవాడకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల(బాలురు) సంఘటనపైనే కాకుండా ఏటీడబ్ల్యూ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహంలో పర్యవేక్షణ లోపం, వివిధ అంశాలలో అలసత్వం చూపించినందున కృష్ణమోహన్‌పై క్రమశిక్షణ చర్యల నిమిత్తం సిఫార్సు చేశామని వివరించారు. అదేవిధంగా టెండర్‌దారుడు సరఫరా చేసిన ఆహార పదార్థాల నాణ్యతపై కూడా నోటీసు జారీ చేశామని స్పష్టం చేశారు.

సొంతింటి కల జగన్‌తో సాకారం


జిల్లేళ్లగూడెంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న తెల్లం బాలరాజు, కారుమూరు సునీల్, తెల్లం రాజ్యలక్ష్మి

పోలవరం రూరల్: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంతో సాకారం చేసుకున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలో పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలను ఆయన నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కొండ్రుకోట, ఎల్ఎన్‌డీపేట, జిల్లేళ్లగూడెం, ప్రగడపల్లి, వింజరం, పోలవరం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, షాపింగ్ కాంప్లెక్స్ తదితర పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మండలంలో రూ. 4.67కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రారంభించారు. అలాగే ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీలో రూ. 50లక్షల నిధులతో నిర్మించే అదనపు భవనానికి శంకుస్థాపన చేపట్టారు. జిల్లేళ్ల గూడెం గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ , వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించారన్నారు. ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మిలకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చేగొండిపల్లి గ్రామంలో యువతకు క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


లబ్ధిదారులకు ఇళ్ల హక్కు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదలంక, వేములదీవి పడమర, వేములదీవి తూర్పు తదితర సంబంధించి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు ప్రసాదరాజు అందించారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన డాక్యుమెంట్‌లపై లబ్ధిదారుడు పూర్తి హక్కులను కలిగి ఉంటారని ఆయన అన్నారు. వారసులకు ఇవ్వడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి ఎటువంటి ఆటంకాలు ఉండవని ఆయన వివరించారు. అలాగే అభివృద్ధిలో నరసాపురం నియోజకవర్గం రాష్ట్రంలో ముందు ఉందని పేర్కొన్నారు. నరసాపుం మండలంలోని సారవ, వేములదీవి పడమర, వేముదీవి తూర్పు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. తొలుత మండలంలోని సారవ గ్రామంలో రూ.4.66 కోట్లతో పెద సారవ గ్రామంలోని ఆర్‌అండ్‌బి రహదారి నుంచి గాంధీ నగర్ మీదుగా పెదలంక వరకూ నిర్మించే రహదారి, వేములదీవి పడమరలో రూ.33లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంకు, మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం, రూ.39 లక్షలతో నిర్మించిన పలు సిమ్మెంట్ రహదారులు, కాలిబాట వంతెన, వేములదీవి తూర్పు గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన పలు సిమ్మెంటు రహదారులను ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, జిల్లా మత్స్యకారసంఘం అధ్యక్షులు అండ్రాజు చల్లారావు పాల్గొన్నారు.

పింఛను సొమ్ము కాజేసిన మోసగాడు


మోసపోయిన వృద్ధులు


సీసీ కెమెరాలో నమోదైన అనుమానాస్పద వ్యక్తి

తణుకు: వృద్ధులకు మాయమాటలు చెప్పి ఓ గుర్తుతెలియని వ్యక్తి ముగ్గురు వృద్ధుల వద్ద రూ.9 వేలు కాజేసిన ఘటన శుక్రవారం తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన మండేపూడి పద్మ, మండేపూడి సూర్యకాంతం, గొల్లి సావిత్రి పక్కపక్కనే ఇళ్లలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వార్డు వలంటీర్ సూరిబాబు వచ్చి రూ.3 వేల చొప్పున ముగ్గురు వృద్ధులకు పింఛను సొమ్ము ఇచ్చి వెళ్లాడు. ఆ తర్వాత సుమారు 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనను కలెక్టర్ పంపారని, తాను ఉన్నతాధికారినని పరిచయం చేసుకున్నాడు. మీకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.4 లక్షలు చొప్పున రుణం మంజూరైందంటూ నమ్మబలికాడు. అలాగే పింఛను సొమ్ము ఈ నెల నుంచి రూ.6 వేలకు పెంచారని, రూ.3 వేలు ఇవ్వడమేంటి? అని ప్రశ్నించాడు. సచివాలయానికి వచ్చి అడుగుతానని చెప్పి.. మీ వద్ద ఉన్న రూ.9 వేలు ఇవ్వండని అడిగి తీసుకున్నాడు. ఆఫీసుకు వెళ్లి మాట్లాడి రూ.18 వేలు తెచ్చిస్తానని చెప్పి ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో ముగ్గురూ వీధి చివరనున్న జిరాక్సు షాపునకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రూ.9 వేలు తీసుకుని పరారయ్యాడు. సమీపంలోని ప్రగతి కళాశాలకు చెందిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులుఏ పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని సీఐ నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఉయ్యూరు వీరమ్మ జాతర మహోత్సవం


ఉయ్యూరు వీరమ్మ తల్లిని దర్శించుకున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్


తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్. అగ్రహారం గ్రామంలో ఉయ్యూరు వీరమ్మ తల్లి జాతర మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి చల్లని చూపుతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో నీల పాల రామన్న, పోలిమోలు గోదావరి, కొత్తపల్లి ప్రసాద్, వీరమళ్ళ సుబ్రహ్మణ్యం, సీహెచ్.కృష్ణ, ఆలయ కమిటి సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం


మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు పట్టణంలోను, పెంటపాడులోను శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. ఆరు కళాశాలలు వాసవి, జీఎంఆర్, ఆదిత్య, ప్రగతి, గోయెంకా ఉమన్స్, పెంటపాడు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకే ఆయా కళాశాలలకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థుల హాల్ టికెట్‌లను, కాలేజీ ఐడీలను కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో పరిశీలించారు. రోల్ నెంబర్ ఆధారంగా కేటాయించిన గదుల్లో పరీక్షలు రాశారు. మొత్తం 2,391 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 2,324 మంది పరీక్షలు రాశారు. 67 మంది హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయిని ఆయా కళాశాలల ప్రతినిధులు తెలిపారు.

మాజీ ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్మన్ అందే సత్యనారాయణ మృతి


అందేసత్యనారాయణ (ఫైల్)

అత్తిలి: జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ మాజీ చైర్మన్ అందే సత్యనారాయణ (89)శుక్రవారం మృతి చెందారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన ఆయన కొంతకాలంగా వయోభారంతో ఇంటివద్దనే ఉంటున్నారు. కాంగ్రెస్‌వాదిగా గుర్తింపు పొందిన అందే సత్యనారాయణ క్లాస్ -1 కాంట్రాక్టర్‌గా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఏపార్టీ అధికారంలో ఉన్నా గ్రామాభివృద్ధి కోసం అందేసత్యం పరితపించేవారు. అందే సత్యం భార్య లక్ష్మమ్మ స్కిన్నెరపురం గ్రామ సర్పంచ్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. అత్తిలి జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికై జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

మొగల్తూరు: పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి నిర్వహిస్తామని, పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు పుష్పరాజ్యం, శ్యామ్యూల్ జాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాళీపట్నం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులు పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మండలంలోని పది ప్రభుత్వ పాఠశాలలకు సంబంధిం 620 మంది విద్యార్థులు, ఐదు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 150 మంది విద్యార్థులు పది పరీక్షలకు హజరుకానున్నట్టు తెలిపారు. మండలంలోని శేరేపాలెం, మొగల్తూరు ఏ, బీ, ముత్యాలపల్లి, కేపీ పాలెం, జగన్నాథపురం ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామని వివరించారు.

పేదోడి గుండెకు సర్కారు భరోసా

- గుండెపోటు మరణాలకు చెక్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తనాళాల్లో బ్లాక్ నివారించే ఇంజక్షన్స్
- ఇప్పటికే జిల్లాలో ఇద్దరు రోగుల ప్రాణాలు కాపాడిన వైనం


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రక్తనాళాల్లో బ్లాక్స్ నివారణ ఇంజక్షన్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి. (ఫైల్)


గుండె పోటు సందర్భాల్లో బ్లాక్‌లు ఉన్న వారికి ఇచ్చే ఇంజక్షన్

తణుకు అర్బన్ : గుండె పోటు మరణాల సంఖ్యను తగ్గించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రమే ఉండే ఖరీదైన అత్యవసర వైద్య సౌకర్యాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇటీవల కాలంలో మరణాల రేటులో అధికశాతం గుండెపోటుతోనే మృత్యువాత పడుతున్న తీరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి గుండె రక్తనాళాల్లో ఏర్పడ్డ బ్లాక్‌ల కారణంగా తలెత్తే గుండెపోటు సమయంలో ఇంజక్షన్ చేయడం ద్వారా ప్రాణాన్ని కాపాడే ఇంజక్షన్‌ను సర్కారు ఆస్పత్రుల్లో ప్రవేశపెట్టారు. జిల్లాలోని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి మార్కెట్‌లో రూ. 30వేలకు పైగా ధర పలికే ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచారు. ఈ ఇంజక్షన్ చేయాల్సిన పరిస్థితులపై ఇప్పటికే జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వైద్యులకు కార్డియాలజీ విభాగ వైద్యులచే ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఈ ప్రత్యేక విభాగాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇటీవలే తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రారంభించారు.

గుండెలో బ్లాక్‌లను కరిగించే ఇంజక్షన్..

గుండెపోటు పలు కారణాలతో వచ్చే పరిస్థితులు ఉన్నప్పటికీ అధికశాతం గుండె నాళాల్లో ఏర్పడే బ్లాక్‌ల వలన గుండెపోటు సంభవించి ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎవరికైనా గుండె పోటు సంభవించినప్పుడు అరగంటలోపు ఈ ఇంజక్షన్ చేయగలిగితే ప్రాణాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చిన రోగిని అత్యవసర విభాగంలో అందుబాటులో ఉన్న బయోనెట్ ఈసీజీ మిషన్ ద్వారా ఈసీజీని ఈసీసీ స్టెమీ యాప్‌లో పొందుపరచడం ద్వారా విజయవాడ, కాకినాడ ఆస్పత్రుల్లో ఉన్న కార్డియాలజీ విభాగాల ప్రత్యేక వైద్యులు పరిశీలించి నిముషాల వ్యవధిలోనే ఎందువలన గుండెపోటు వచ్చిందో తెలుపుతూ బ్లాక్ ఉన్నదీ లేనిది చెబుతారు. ఒకవేళ బ్లాక్ ఉన్నట్లయితే వెంటనే సదరు ఇంజక్షన్ చేస్తారు. అనంతరం మెరుగైన వైద్యసేవలకు విజయవాడ, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ఆరోగ్యశ్రీ సేవలున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపించాల్సి ఉంటుంది. ఇలా గుండె పోటు వచ్చిన రోగిని గోల్డెన్ అవర్‌లో ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకురావడం బ్లాక్‌లు ఉన్న వారికి ఇంజక్షన్ చేసి పెద్దాసుపత్రులకు పంపించే విధానం అమలవుతోంది. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో రెండేసి చొప్పున టినెక్టీ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే జిల్లాలోని నరసాపురం, జంగారెడ్డిగూడెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చిన ఇద్దరు రోగులకు ఈ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడినట్లు వైద్యులు చెబుతున్నారు.

ఇంజక్షన్ ఇచ్చి బ్లాక్‌లను కరిగించవచ్చు



గుండెపోటు మరణాల్లో అధికశాతం రక్తనాళాల్లో బ్లాక్‌లు ఏర్పడి ప్రాణం పోతుంది. ఈ కారణంగా గుండె పోటు మరణాలను నిరోధించే క్రమంలో బ్లాక్‌లను కరిగించి ప్రాణాపాయం నుంచి తప్పించే క్రమంలో ఆ గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఇంజక్షన్‌ను చేయడం ద్వారా ప్రాణం కాపాడవచ్చు. గుండెపోటు అనిపించిన వెంటనే రోగిని తక్షణమే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావాలి.

– డాక్టర్ వెలగల అరుణ, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

కార్డియాలజీ వైద్యుల సూచనలతో



గుండె పోటు సంభవించిన సందర్భాల్లో రోగి బంధువులు చాలా వేగంగా స్పందించి రోగిని ఆస్పత్రికి చేర్చాల్సి ఉంటుంది. ఆస్పత్రికి రాగానే ప్రత్యేక విభాగంలో అందుబాటులో ఉన్న ఈసీజీ మిషన్ ద్వారా ఈసీసీ స్టెమీ యాప్ నుంచి విజయవాడ, కాకినాడ ఆస్పత్రుల్లోని కార్డియాలజీ వైద్యులతో సంప్రదించి అవసరమైన సందర్భంలో ఇంజక్షన్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ఇటువంటి ఖరీదైన ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామం.

– డాక్టర్ దాసరి సత్యకుమారి, జనరల్ మెడిసిన్, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

సర్కారు ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. ఇప్పటివరకు గుండెపోటు వచ్చిందంటే చాలు విజయవాడ, కాకినాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కానీ అంతదూరం ప్రయాణించే లోపే విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రక్తనాళాల్లో బ్లాక్‌లు కరిగించే ఇంజక్షన్‌లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

గ్రామాల్లో ఉమాబాల ఆత్మీయ సమావేశాలు


తూర్పు విప్పర్రు, కె ఇల్లిందలపర్రు గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరు ఉమాబాల

ఇరగవరం: రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల కోరారు. శుక్రవారం సాయంత్రం ఇరగవరం మండలంలోని కె ఇల్లిందలపర్రు, తూర్పు విప్పర్రు, సూరంపూడి తదితర గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ పెద్దలను కలసి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ నాయకులు, పెద్దలను కలసి రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలివాలని కోరారు. ఈకార్యక్రమంలో ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి నాగార్జున, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్‌వీఆర్‌కే ప్రసాద్, వీ రాఘవేంద్ర, తూర్పు విప్పర్రు గ్రామంలో కోన వెంకటరెడ్డినాయుడు తదితరులు ఉన్నారు.

ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద ఈ-క్రాప్ రైతుల జాబితాను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేది లోపు రైతులు ఈ-క్రాప్‌లో తమ పేరు ఉన్నది, లేనిది సరి చూసుకోవాలన్నారు. సర్వే నెంబరు, విస్తీర్ణం, పంట రకం సరిగా ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఏదైనా తప్పులుంటే ఆర్బీకే ఇన్‌చార్జీని సంప్రదించి గ్రీవెన్స్ నమోదు చేయాలన్నారు. తదుపరి తప్పులను సవరించడం జరుగుతుందన్నారు. తుది జాబితాను ఈ నెల 8వ తేదిన ఆర్బీకేల వద్ద ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు

అత్తిలి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 2వ విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేగేశ్న ధన సత్యనారాయణరాజు అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం గుమ్మంపాడు సచివాలయం వద్ద 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యశిబిరంలో 394 మందికి జనరల్ వైద్యచికిత్సలు, 20 మందికి మానసిక వైద్యసేవలు, 18 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్ సాయిబాలాజీ, డాక్టర్ రియాజ్, కంటివైద్యనిపుణుడు ఎస్ రామిరెడ్డి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, మాజీ సర్పంచ్ పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు నేటపాటి సుబ్బయ్య, సీహెచ్ఓ పి మురళి, హెచ్ఈ జి ప్రమీలారాణి, హెచ్‌వీ పి అమ్మాజీ, హెచ్ఎస్ వెంకట్రాజు, సుభద్ర, జి శిరీషా, జెఎస్ గనిరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్షను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని రెండవ సచివాలయం పరిధిలోని నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 330 మంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పీ అలువేలు తెలిపారు. శుక్రవారం వేల్పూరు గ్రామంలోని 2వ ఎంపీపీయూపీ స్కూల్ వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులతో పాటు జనరల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం ఓపీ 330 కాగా వారిలో స్త్రీలు 197 మంది, పురుషులు 133 మంది, పాఠశాల విద్యార్థులు 8 మంది, 28 మందికి కంటి పరీక్షలు, ఆరుగురు గర్భిణీ స్త్రీలు ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, పంచాయతీ సభ్యులు రెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, వైద్యులు డాక్టర్ కే కీర్తి, డాక్టర్ రమేష్, వై సంహిత, కె సాయి భవానీ, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలను వెంటనే చెల్లించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ ఎంఎస్ నెంబర్ 35 ప్రకారం ఆస్తిపన్ను బకాయిలపై వన్ టైం సెటిల్మెంట్ విధానం ద్వారా వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ తెలిపారు. భవనాలతో పాటు ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ మాఫీ చేస్తారని, ఈ సంవత్సరం మార్చి 31 వరకు ఈ నిబంధన వర్తిస్తుందని చెప్పారు. ఈ నిర్ణయంతో కొన్నేళ్లుగా వసూళ్లు కాకుండా ఉన్న మొండి బకాయిలన్నీ వసూలయ్యే అవకాశం ఉంది. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో, ఆయా సచివాలయాల్లో వెంటనే చెల్లించాలని పట్టణ ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

పేదలు, అనాథలకు సేవ చేయడమే లక్ష్యం


పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పేద, అనాథలకు సేవ చేయడమే తమ సంస్థ లక్ష్యమని వల్లీ, మోహన్ యువజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పటాన్ వలీ, గొల్లేరు మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మ కాలనీలోని సమితి కార్యాలయంలో పేదలకు బియ్యం, దుస్తులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి తమ సంస్థకు సహాయ, సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. తద్వారా పేద, అనాథలకు సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గజ్జెల సమర్పణరావు, ఉపాధ్యక్షుడు బచ్చు దినేష్, మెంటే రాంబాబు, పోలిశెట్టి గంగ, కోడే శ్రీరామ్, పటాన్ సుభాని, నేదూరి సత్యనారాయణ, పోలిశెట్టి రంగ, యువీ.సుజాత, జాలి దానయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం


తోలేరులో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో సుమారు 2.48 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా తోలేరు గ్రామంలో రూ.19 లక్షల 20 వేల నిధులతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ.23 లక్షల 94 నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే రూ.41 లక్షల 70 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు, 18 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అండలూరు గ్రామంలో రూ.43 లక్షల 60 వేల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మళ్లీ అవకాశమిస్తే అభివృద్ధి కొనసాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని, మరో పక్క అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఒక మాట ఇస్తే దానిని నిలబెట్టుకునే వరకు నిద్రపోరని, కాబట్టి రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, అదే మాదిరిగా భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి రేయింబవళ్లు పనిచేస్తున్న నాకు ప్రజల అండదండలు పూర్తిగా ఉండాలని ఆయన కోరారు.

పింఛన్లపై టీడీపీ రాద్ధాంతం తగదు


పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు

పెంటపాడు: మండలంలో వలంటీర్లు శుక్రవారం పింఛన్లు సక్రమంగా ఇస్తుంటే టీడీపీ నాయకుడు పంచాయతీ సిబ్బంది, వలంటీర్లుపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తెలిపారు. పెంటపాడు పంచాయతీ కార్యాలంలో ఎంపీటీసీ విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్లు ఇస్తున్న తరుణంలో టీడీపీ నాయకులు గలాటా సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. పింఛన్లు పంపిణీ పూర్తి కాకముందే టీడీపీ నాయకులు ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ నాయకులకు ప్రజలే సరైన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానంద రెడ్డి, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, ఏఎంసీ డైరెక్టర్ నలుమూరి ప్రకాష్, బండారు రాంబాబు, బర్ల జయరాంబాబు, కొలుపూరి శివకిరణ్, కాసారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణమయ పథకానికి రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి తాడేపల్లిగూడెంకు చెందిన సీహెచ్‌వీడీ రాజేష్ శుక్రవారం రూ.2,00,101 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. తొలుత రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

సోషల్ మీడియా వేదికగా జనసైనికుల విమర్శలు

తణుకు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ తణుకు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా తణుకు రాజకీయ పరిస్థితులపై అధికారపార్టీ, ప్రతిపక్షాలకు చెందిన వారు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను పంచుకోవడంతోపాటు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. అధికారపార్టీకి చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేస్తుండగా జనసేన, టీడీపీల మధ్య సీటు వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. తణుకు అసెంబ్లీకి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేరును ఇటీవల ఖరారు చేశారు. దీంతో తణుకు జనసేన పార్టీ అధ్యక్షుడు విడివాడ రామచంద్రరావు తీవ్ర అసహనం వ్యక్తం చేయడంతోపాటు ఆరిమిల్లి రాధాకృష్ణను ఎట్టిపరిస్థితుల్లోను గెలవనివ్వనంటూ బహిరంగంగానే విమర్శించడం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం అల్లంపురంలో ఇటీవల బసచేసిన జనసేన పార్టీ అధికార ప్రతినిధి నాదెండ్ల మనోహర్ ఉన్న భవనం వద్దకు తణుకు నుంచి అధికసంఖ్యలో జనసైనికులు వెళ్లి నినదించడం కూడా సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో పాటు ఇదే సోషల్ మీడియా వేదికగా జనసైనికులు రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు 24 సీట్లను కేటాయించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ తమ ఓటు వైఎస్సార్ సీపీకి బదలాయిస్తామని కొందరు, నోటాకి వేస్తామే కానీ టీడీపీ అభ్యర్థికి వేయమంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని 2,33,082 ఓటర్లు ఉండగా 50వేల పైచిలుకు కాపులు ఉన్నారు. అధికారపార్టీకి అయినా ఓటేస్తాము కానీ టీడీపీ అభ్యర్థికి ఓటెయ్యమంటూ సోషల్ మీడియాలో కొందరు జనసైనికులు పోస్టులు పెడుతుండడాన్ని టీడీపీ సానుభూతిపరులు ఓర్వలేకపోతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తణుకు టౌన్: తణుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంస్తాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించే ఆక్యు ప్రెజర్ వైద్య చికిత్స శిబిరం శుక్రవారం ప్రారంభించారు. శుక్రవారం తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో రాజస్తాన్ థెరపీ కార్యక్రమాన్ని తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వై నాగరాజకుమార్ ప్రారంభించారు. ఈశిబిరంలో ఊబకాయం, రక్తపోటు, సయాటిక, మధుమేహం, పక్షవాతం, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి చికిత్సను అందజేస్తారు. ఆరు రోజుల పాటు తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఉచితంగా ఈ చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ఈశిబిరంలో వైద్యులు డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరి, తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వై నాగరాజకుమార్, కార్యదర్శి ఎం రవి రిజనాల్డ్, ఎస్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.